ఇవేమి రోడ్లు బాబు


గాదెలపాలెంలో గుంతలమయమైన రోడ్డు


ఇటికాయలపల్లి, గాదెలపాలెం గ్రామాల మధ్య పుంతరోడ్డును తలపిస్తున్న రహదారి

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గోకవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు గుప్పించడంతో ప్రజలు నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. కానీ, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తుందని ప్రజలు అంటున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రహదారులను పునరుద్ధరిస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలు నీటిమీద రాతలుగా మారడంతో, గ్రామీణ ప్రాంత రహదారులు పుంత రోడ్లను తలపిస్తున్నాయి.


గాదెలపాలెం శివారున బురదమయమైన రహదారి

మండలంలో తంటికొండ నుంచి గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం వరకు ఉన్న రహదారి, గోకవరం నుంచి రంపయర్రంపాలెం రహదారి, గోకవరంలో సంజీవయ్యనగర్ నుంచి రామాంజీపురం, చిన్నూరు మీదుగా రామన్నపాలెం వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రహదారుల్లో పలుచోట్ల గోతులు పడ్డాయి. వర్షం పడుతుండటంతో ఈ గుంతుల్లో బురద చేరి పుంతరోడ్లను తలపిస్తున్నాయి. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఛిద్రమైన రహదారులు

తంటికొండ, గాదెలపాలెం గ్రామాల మధ్య, గాదెలపాలెంలో రామాలయం సెంటర్, గ్రామ శివారున ఇటికాయలపల్లికి వెళ్లే మార్గంలో రహదారి అధ్వానంగా మారింది. రహదారి గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే ఇటికాయపల్లి నుంచి గోపాలపురం వెళ్లే పంచాయతీరాజ్ రహదారి మొత్తం అధ్వానంగా తయారైంది. సుమారు 2 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రహదారి మొత్తం గుంతలు పడి రాళ్లు పైకి లేచాయి. గోకవరంలోని పశువుల సంత మార్కెట్ నుంచి రంపయర్రంపాలెం వరకు ఉన్న సుమారు మూడు కిలో మీటర్ల రహదారి మొత్తం గుంతలు పడ్డాయి. ఈ మార్గం మీదుగా నిత్యం రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం, గంగంపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి ఛిద్రమై ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిధుల మంజూరు

రెండు నెలల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి **రూ.కోటి నిధులు** మంజూరయ్యాయి. కానీ **ఇప్పటివరకు వాటి** పనులు ప్రారంభించకపోవ**డంతో ప్రజలకు** ఇబ్బందులు తప్పడం లేదు. **అదేవిధంగా గో**కవరంలో సంజీవయ్యనగర్ **నుంచి రామాంజీ**పురం, చిన్నూరు గ్రామాల **మీదుగా రామన్న**పాలెం వరకు ఉన్న రోడ్డు **మొత్తం గోతులతో** దర్శనమిస్తోంది. వాటి **పరిస్థితి ఈ విధ**ంగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రోడ్డుల పునరుద్ధరణపై దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఈ రోడ్డులను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ముద్రగడ కోసం కుటుంబ సభ్యుల పూజలు


గరగతో ప్రదక్షిణలు చేస్తున్న ముద్రగడ కుటుంబీకులు


రూపలమ్మకి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ధర్మవరంలో నూకాలమ్మకి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ముద్రగడ సతీమణి పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని గరగలకు పాలాభిషేకం నిర్వహించి మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. చిల్లంగిలోని శ్రీనివాసానగర్‌లో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రజిత అష్టదళ పూజ, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు.

ముద్రగడ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌లోని రూపమ్మతల్లి గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలకు అనేక సేవలు చేసిన ముద్రగడ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, గొల్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి రావాలని కోరుతూ మండలంలోని ధర్మవరం నూకాలమ్మ ఆలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ముద్రగడ అనారోగ్యం నుంచి కోలుకోవాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు సీతారామరాజు, జువ్వల చిన్నబాబు, జువ్వల బాబులు, బొల్లు నానిబాబు పాల్గొన్నారు.

ఉత్తరకంచిలో ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి రావాలని కోరుతూ మండలంలోని ఉత్తరకంచి నూకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించచారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, కందా మాణిక్యం, బొడ్డు చిన్నా, చెలపరెడ్డి చక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత


నాణ్యతాలోపంతో శిథిలమైన రోడ్లు

'నాణ్యతాలోపంతో శిథిలమైన రోడ్లు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం


జగపతినగరం శివారున కంకరతో గోతులను పూడ్చుతున్న వైనం

సాక్షి ఇంపాక్ట్

కిర్లంపూడి: రాజుపాలెం నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన రహదారి గోతుల పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించడానికి వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై గత బుధవారం 'నాణ్యతాలోపంతో శిథిలమైన రోడ్లు' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత స్పందించారు. ఆమె ఆదేశాలతో జగపతినగరంలోని ఊరు శివారున, ప్రత్తిపాడుకు సమీపంలో ఉన్న గోతుల్లో కంకర వేసి పూడ్చారు. ఈ పనులను సర్పంచ్ సభ్యుడు గుడాల రాంబాబు పర్యవేక్షించారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు కుటుంబాలను దత్తత తీసుకున్న సీఐ

కోటనందూరు: పీ–4 కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగన్నాధపురం, కాకరాపల్లి గ్రామాల్లో రెండు బంగారు కుటుంబాలను తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు దత్తత తీసుకున్నారు. ఆదివారం స్థానిక ఎస్సై టి.రామకృష్ణతో కలిసి ఆయా కుటుంబాలను కలిశారు. ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, జీవన విధానం, పిల్లలు, ఆర్థిక వనరులు, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై ఆరా తీశారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


జగన్నాథపురంలో బంగారు కుటుంబంతో మాట్లాడుతున్న సీఐ

ఆర్థిక సాయం అందజేత

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో పీ–4లో భాగంగా కాకినాడ జిల్లా విద్యుత్‌శాఖ ఈఈ ఉదయ్‌భాస్కర్ 6 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. వారికి ఆదివారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతుల చేత అందజేశారు. నియోజకవర్గంలో 8,200 బంగారు కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. అయితే వీళ్లను ఆదుకునేందుకు జగ్గంపేటలో దత్తత తీసుకునే వారు లేని కారణంగా బయటనుంచి పలువురిని సంప్రదించి వారి ద్వారా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

రౌతులపూడి: మండలంలోని దిగువశివాడ గ్రామ శివారు తాండవ కాలువ గట్టుపై పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసివారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వేంకటేశ్వరరావు తెలిపారు. తాండవ కాలువ గట్టుపై పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం దాడి చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తుని రైల్వే స్టేషన్ పరిధిలోని యలమంచిలి–నరసింగపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తెల్ల రంగుపై ఎరుపు, నలుపు రంగుల డిజైన్ల పొట్టి చేతుల చొక్కా, నలుపురంగు జీన్స్ ధరించి ఉన్నాడు. అతని ఎడమ చేతిపై త్రిశూలం పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 94906 19020 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

డీసీసీబీ టర్నోవర్ రూ.7వేల కోట్లు

తుని రూరల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.7 వేల కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. ఆదివారం గెడ్లబీడు సాయివేదికలో జరిగిన ఎస్.అన్నవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. బాబు మాట్లాడుతూ, డీసీసీబీకి రూ.300 కోట్లు అప్పులు ఉన్నాయన్నారు. రూ.1,650 కోట్ల డిపాజిట్లు, రూ.720 కోట్ల బంగారు రుణాలు, రూ.7వేల కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడిగా పోలిశెట్టి రామలింగేశ్వరరావు, సభ్యులుగా ధారకొండ వెంకటరమణ, అనిమిరెడ్డి మల్లిబాబు ప్రమాణం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఈగల విజయ దుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించి బ్లీచింగ్, దోమల మందు పిచికారి చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు.

లయన్స్ సేవలు మరింత విస్తృతం

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్టు లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ రమేష్ రాజు అన్నారు. పట్టణంలో ఆదివారం ఏలేశ్వరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్ రాజు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఏలేశ్వరంలో లయన్స్ క్లబ్ స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకొని అనేక సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. లయన్స్ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నూతన కార్యవర్గం మరిన్ని సేవలు చేయాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా అనసూరి నాగేశ్వరరావు, కార్యదర్శిగా గొల్లపూడి గణేష్, కోశాధికారిగా అలమండ దుర్గా వెంకటప్రసాద్, సభ్యులుగా జ్యోతుల శ్రీనివాస్, వూరా రాజబాబు, కప్పల నాగభూషణం, తాలూరి గొల్లాజీ రావు, కోట శ్రీనివాస చక్రవర్తి, వూరా అప్పన్నబాబు తదితరులు ఎన్నికయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రాజు

చినుకుపడితే జారిపడాల్సిందే

గండేపల్లి: మండలంలోని సుబ్బయమ్మపేట ప్రభుత్వ (ఎంపీపీ) పాఠశాల ఆవరణలో చినుకుపడితే బురదమయం అవుతుంది. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ లోపలికి వచ్చే మార్గంతోపాటు, ఆ ప్రాంతమంతా నాచుకట్టి జారిపోయే విధంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వర్షం కురిస్తే స్కూల్ బయట, లోపల బురదగా ఉండటంతో పిల్లలు జారిపడిపోతారేమోనని ఆందోళన చెందుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మార్గం మరింత ఇబ్బందికరంగా ఉందన్నారు.


సుబ్బయమ్మపేట ఎంపీపీ స్కూల్ వద్ద బురదమయం

అతివేగం.. అవసరమా!

- హైవేపై నిర్లక్ష్యంగా ట్రావెల్స్ బస్సుల ప్రయాణం
- భయాందోళనలో వాహనదారులు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు

తొండంగి: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు త్వరగా గమ్యాన్ని చేరుకోవాలన్న ఆతృతతో ప్రమాదకర రీతిలో ప్రయాణాలు సాగిస్తున్నాయి. బెండపూడి వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆదివారం నిర్లక్ష్యంతో అతివేగంగా ప్రయాణం సాగించడంతో తోటి వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌తో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వైజాగ్ నుంచి రాజమండ్రి వైపు వెళుతుంది. ఈ బస్సు అతి వేగంతో నిర్లక్ష్యంగా వెళుతుండటంతో బైక్‌పై వెళ్లే ఇద్దరికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

అదేవిధంగా పలు కార్లు, లారీ తదితర వాహనాల డ్రైవర్లు భయాందోళనకు గురయ్యేలా బస్సు డ్రైవర్ ట్రాఫిక్, రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడిపారు. హైవేలపై ప్రయాణికులను ఎక్కించుకుని త్వరగా గమ్యాన్ని చేరాలని అతి వేగంగా ప్రయాణాలు సాగించి ఇతర వాహనాల ప్రమాదాలకు కారణమవ్వటం, ఆ బస్సులు కూడా ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ విధంగా ఇటీవల కాలంలో ప్రత్తిపాడు, కత్తిపూడి, తుని ప్రాంతాల్లో ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. బస్సులోని ప్రయాణికులు కూడా గాయాలపాలై ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో హైవేలపై అతివేగంగా వెళ్లే వాహనాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే లైసెన్సును కూడా రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భానుడి ప్రతాపంతో ప్రజల ఇక్కట్లు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవగా.. ఆదివారం భానుడు ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడారు. ఉదయం నుంచే ఉష్ణోగ్రత పెరిగి ఉక్కపోత వాతావరణం నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగనున్నాయి.

పట్టపగలే విద్యుత్ వెలుగులు


పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

గండేపల్లి: మండలంలోని సుబ్బయమ్మపేటలో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. సంబంధిత అధికార యంత్రాంగం పగటి పూటను కూడా రాత్రిగా భావిస్తున్నారో.. ఏమోగానీ వీధి దీపాలు ఆర్పే ప్రయత్నం చేయకపోవడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలుగుతునే ఉంటున్నప్పటికి విద్యుత్, పంచాయతీ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

సీతబాబుకు తోట నరసింహం నివాళి


సీతబాబు కుటుంబీకులను పరామర్శిస్తున్న తోట నరసింహం

గోకవరం: గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి చినబాబు సోదరుడు సీతారామయ్య (సీతబాబు) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో అకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం గోకవరంలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు సుంకర వెంకటరమణ, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, బడిరెడ్డి అప్పన్నదొర, సుబ్బారాయుడు, తోట్టా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సెలింగ్


కోటనందూరులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కోటనందూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై టి.రామకృష్ణ రౌడీషీటర్లను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం మండంలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. మాదక ద్రవ్యాలు, భౌతికదాడులు, భూఆక్రమణల జోలికి వెళితే చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలగకుండా సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. సమాజంలో చెడు నడవడిక కలిగిన వారిపై ప్రత్యక్షంగా, సాంకేతికతతో గట్టి నిఘా ఉంచామన్నారు. నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ బనాయిస్తామని హెచ్చరించారు.

వరశ్రీకి సత్కారం


విశాఖపట్నంలో వరశ్రీని సత్కరిస్తున్న నిర్వాహకులు

తుని: విశాఖపట్నం శ్రీశ్రీ కళావేదికలో విశాఖ సాగరతీర కవితోత్సవం పేరుతో 150వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల నుంచి తెలుగు కవులు, కళాకారిణులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. తునికి చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయుడు ఈరంకి సత్యవరప్రసాద్ (వరశ్రీ) పాల్గొని 'గురుదేవోభవ' అనే శీర్షికతో పద్య కవితను ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వరశ్రీని శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించి అభినందించారు.

రహదారిపై వరదనీరు


శృంగవృక్షంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

తొండంగి: మండలంలో కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లోని వరదనీరు రహదారులపై ప్రవహించడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మండలంలోని శృంగవృక్షంలో నాయిబ్రాహ్మణ కాలనీ వద్ద రోడ్డుకు ఇరువైపులా డ్రైయిన్‌లు లేకపోవడంతో ఇళ్లలోని మురికినీటితోపాటు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటి ప్రవాహం రోడ్డుపై ప్రవహించడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా వరదనీరు స్తంభించడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు వరదనీరు పోయేందుకు పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

గోకవరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఇతర అధికారులు పాల్గొంటారని ఎంపీడీఓ గోవింద్ ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే కార్యక్రమంలో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఎస్టీయూ మండల కమిటీ సభ్యులు

గోకవరం: ఎస్టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో జరిగింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా ఓ.రమణశర్మ, ప్రధాన కార్యదర్శిగా కె.నాగేంద్రబాబు, గౌరవాధ్యక్షుడు బి.రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా కె.రామచంద్రుడు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె.కుమారి, గౌరవ సలహాదారుడిగా సీహెచ్ చినవీర్రాజు, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రామకృష్ణ, ఆర్.కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా కె.వరలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, మహిళా కన్వీనర్‌గా కె.విజయకుమారి, అభయ్ కన్వీనర్‌గా సీహెచ్ వెంకటరావు, జిల్లా కౌన్సెలర్లుగా ఎస్.రామకృష్ణ, వర్ధినికృష్ణ, కార్యదర్శులుగా షేక్ రుజ్వాన్ ఖాతూన్, విజయశ్రీ, సింహాచలం తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జేడీఐజీ డానియల్ బాబ్ పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

తంటికొండ దేవస్థానం నూతన కమిటీ ప్రకటన

గోకవరం: మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం ప్రకటించారు. 11 మంది సభ్యులతో కూడిన కమిటీని కులాలు, ప్రాంతాల వారీగా సమతుల్యంగా నియమించినట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్‌గా బద్దిరెడ్డి అచ్చన్నదొరతో పాటు, సభ్యులుగా సుంకర వీరమణి, ఏగి దుర్గాదేవి, నాగులపాటి అరుణకుమారి, చింతల నాగేశ్వరరావు, బొట్టా రామకృష్ణ, పసుమర్తి సత్యకళ, సప్పిడి పెంటరాజు, మల్ల అమ్మాజీ, వల్లూరి ప్రసాద్, మడకం పద్మ, ఎక్స్ అఫీషియల్ నంబర్‌గా దేవస్థాన పురోహితుడు పెద్దింటి దత్తును నియమించామన్నారు. కమిటీకి సంబంధించిన గెజిట్ త్వరలో వస్తుందన్నారు.

సొసైటీ చైర్మన్ ప్రమాణస్వీకారం

జగ్గంపేట: పట్టణంలోని కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం జరిగింది. త్రిసభ్య కమిటీలో సొసైటీ చైర్మన్‌గా బుర్రి సత్యనారాయణ, సభ్యులుగా నంద చిరంజీవి, పాలిశెట్టి సతీష్‌తో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రమాణం చేయించారు. ముందుగా రావులమ్మ తల్లి గుడి వద్ద నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా కో–ఆపరేటివ్ సొసైటీ వద్దకు చేరుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా సంతకాలు చేసిన అనంతరం స్థానిక కాపు కళ్యాణ మండపంలో ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు.

లంపకలోవ సొసైటీ అధ్యక్షుడిగా రామకృష్ణ

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వరుపుల రామకృష్ణ, కమిటీ సభ్యులు లంపకలోవ సొసైటీలో ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ డైరెక్టర్లుగా మదినే దొరబాబు, కంచుపాటి సూరిబాబు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఒమ్మి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టం రద్దు చేయాలి

కోటనందూరు: హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ డిమాండ్ చేశారు. స్థానిక నూకాలమ్మ గుడి ఆవరణలో రవాణా కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ, ట్రాన్స్‌పోర్ట్ రంగానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు బస్సుల్లో కూడా క్లీనర్లను ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కిర్లంపూడి: సింహాద్రిపురానికి చెందిన వీర వెంకట సత్యనారాయణ వెన్నుముక సంబంధిత సమస్యతో బాధపడుతుండటంతో గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి చారిటీ సభ్యులు మేకా సూర్యప్రకాష్, పబ్బిడిరెడ్డి నాగచక్రం వారికి నిత్యావసరాలు, రూ.10వేలు అందజేశారు.